# ఉప ఎన్నిక హామీలను అమలు చేసిన సీఎం కేసీఆర్

- మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- చండూరులో ఆర్డీఓ కార్యాలయం ప్రారంభించిన మంత్రి


గుడిపల్లిలో తాసీల్దార్ కార్యాలయం ప్రారంభిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్

చండూరు, అక్టోబర్ 4 : మునుగోడు ఉప ఎన్నికలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను అమలు చేశారని, 10 నెలల కాలంలోనే ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి నియోజకవర్గంలో అభివృద్ధిని పరుగులు తీయించారని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. చండూరులో ఏర్పాటు చేసిన ఆర్డీఓ కార్యాలయాన్ని బుధవారం ఆయన ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పనిచేసే వారికే మళ్లీ ఎన్నికల్లో అవకాశం ఇవ్వాలన్నారు. అనతి కాలంలోనే ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి రూ. 550 కోట్లతో మునుగోడు నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. గత ఎమ్మెల్యే కనీసం కల్యాణలక్ష్మి చెక్కులను కూడా పంపిణీ చేయలేక పోతే తానే వచ్చి పంపిణీ చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. వంద పడకల ఆస్పత్రి, రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై కొందరు కుట్రలు చేస్తున్నారని వారిని నమ్మవద్దని ప్రజలకు సూచించారు. మునుగోడు నియోజకవర్గ బాధలు తెలిసిన సీఎం కేసీఆర్ సాగు, తాగునీటికి అధిక ప్రాధాన్యం ఇస్తూ ఫ్లోరైడ్ భూతాన్ని తరిమి కొట్టారన్నారు. పాలమూరు– రంగారెడ్డి, డిండి ప్రాజెక్టులు త్వరలోనే పూర్తయి ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల పేరుతో తెలంగాణ ప్రజలను మోసం చేయాలని చూస్తుందని, ఆ పార్టీ పాలించే రాష్ట్రాల్లో వాటిని ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. రాజ్యసభ సభ్యుడు బడుగు లింగయ్య యాదవ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి పెద్ద కొడుకుగా ఉంటూ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని కొనియాడారు. గత ఎమ్మెల్యే నిర్లక్ష్యం చేయడం వల్లే ఈ ప్రాంతం వెనుకబాటుకు గురైందన్నారు. ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే అధిక నిధులు తీసుకొచ్చానని, పనులన్నీ చేపట్టి ఈ ప్రాంతాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయడానికి మళ్లీ ఎమ్మెల్యేగా అవకాశం కల్పించాలని కోరారు. నియోజకవర్గంలోని ప్రాజెక్టులను పూర్తి చేసి ఆ నీటితో ప్రజల కాళ్లు కడిగి తన రుణం తీర్చుకుంటానన్నారు. హామీలన్నీ సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్ రెడ్డి సహకారంతో నెరవేరుస్తూ వచ్చానన్నారు. ధూపదీప నైవేద్యంలో భాగంగా ఇస్తున్న నిధులు రూ. 10 వేలకు పెంచడంపై హర్షం వ్యక్తం చేస్తూ బ్రాహ్మణ సంఘం నియోజవర్గ అధ్యక్షుడు చిరువెల్లి ప్రవీణ్‌శర్మ ఆధ్వర్యంలో మంత్రిని ఘనంగా సన్మానించారు. అనంతరం గృహలక్ష్మి లబ్ధిదారులకు అనుమతి పత్రాలు, తెలంగాణ క్రీడా పరికరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గీత కార్మిక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవి కుమార్, అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఆర్డీఓ దామోదర్ రావు, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజకుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ తోకల చంద్రకళా వెంకన్న, వైస్ చైర్‌పర్సన్ దోటి సుజాతావెంకటేశ్, ఎంపీపీలు పల్లె కళ్యాణి, స్వామి యాదవ్, శ్వేత, జడ్పీటీసీలు కర్నాటి వెంకటేశం, సురేందర్‌రెడ్డి, మోహ న్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మాధవీవెంకట్‌రెడ్డి, రైతు సేవ సహకార సంఘం చైర్ పర్సన్ కోడి సుష్మావెంకన్న, ఎంపీడీఓ యాకూబ్ నాయక్, తాసీల్దార్ రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్లు అన్నపర్తి శేఖర్, చిలుకూరి రాధికాశ్రీనివాస్, తోకల వెంకన్న, కోడి వెంకన్న నాయకులు బొమ్మరబోయిన వెంకన్న, భూతరాజు దశరథ, మధుసూదన్ రావు, అనిల్ రావు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## గుడిపల్లిని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం

**తాసీల్దార్ కార్యాలయం, పీహెచ్‌సీ భవనం ప్రారంభించిన మంత్రి జగదీశ్‌రెడ్డి**

పెద్దఅడిశర్లపల్లి : గత పాలకుల నిర్లక్ష్యంతో వెనుకబడిన గుడిపల్లి ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. కొత్తగా ఏర్పాటైన గుడిపల్లి మండల కేంద్రంలో తాసీల్దార్ కార్యాలయాన్ని, కొత్తగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని మంత్రి బుధవారం ప్రారంభించారు. అనంతరం జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణంలో మండల సాధన సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కృతజ్ఞతా సభలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పాలనను ప్రజలకు చేరువ చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం సరికొత్త సంస్కరణలు చేపట్టిందని, అందులో భాగంగానే కొత్త జిల్లాలు, మండలాలను ఏర్పాటు చేసిందని అన్నారు. త్వరలో మరిన్ని నిధులు కేటాయించి గుడిపల్లి మండలంలో అన్ని పరిపాలన విభాగాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ ప్రాంతానికి సాగునీరు అందించేందకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే రవీంద్రకుమార్ మట్లాడుతూ ఇప్పటికే గుడిపల్లిలో రూ. 5 కోట్ల పైగా నిధులతో అభివృద్ధి పనులు సాగుతున్నాయని, మరికొన్ని నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ, కాంగ్రెస్‌తో పాటు అన్ని పార్టీల నాయకులు మంత్రి, ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. సమావేశానికి హాజరైన రెండు వేల మందికి బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు ముచ్చర్ల శ్రీకాంత్ భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, అదనపు కలెక్టర్ శ్రీనివాసులు, ఆరీఓ శ్రీరాములు, ఎంపీపీ వంగాల ప్రతాప్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వల్లపురెడ్డి, తాసీల్దార్ శ్రీనువాసులు, సర్పంచ్ శీలం శేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ అర్వపల్లి సరిత, నాయకులు మునగాల అంజిరెడ్డి, ముచ్చర్ల ఏడుకొండల్‌యాదవ్, ఎర్ర యాదగిరి, గున్‌రెడ్డి జనార్దన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు చంద్రారెడ్డి, బీజేపీ నాయకుడు వట్టెపు గోవర్ధన్, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# వైభవంగా సుదర్శన నారసింహహోమం


స్వామి, అమ్మవార్ల నిత్యతిరుకల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, అక్టోబర్4 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం నిత్యసుదర్శన నారసింహహోమం అత్యంత వైభవంగా సాగింది. ఉదయం ప్రధానాలయంలోని కల్యాణ మండపంలో ఉత్సవమూర్తులను అధిష్ఠింపజేసి సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ నారసింహ హవనం నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వయంభూ నారసింహస్వామిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామివారికి నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. స్వామి, అమ్మవార్లను దివ్యమనోహరంగా ముస్తాబు చేసి గజవాహనంపై వేంచేపు చేసి వెలుపలి ప్రాకార మండపంలో ఊరేగించారు. అనంతరం లక్ష్మీసమేతుడైన కల్యాణమూర్తులను ముస్తాబు చేసి భక్తులకు అభిముఖంగా అధిష్టించి నిత్యకల్యాణ తంతును జరిపారు. సాయంత్రం స్వామివారికి తిరువీధిసేవ, దర్బార్‌సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. స్వామివారి తిరువారాధన చేపట్టి, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన జరిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 5వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు, స్వామివారి ఖజానాకు రూ. 8,78,076 ఆదాయం సమకూరిందని ఈఓ ఎన్. గీత, అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి తెలిపారు.


ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసిన జిల్లా శంకర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి,ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, కంచర్ల భూపాల్‌రెడ్డి

# ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుల ప్రమాణ స్వీకారం

- జిల్లా శంకర్‌కు శుభాకాంక్షలు తెలిపిన మంత్రులు, ఎమ్మెల్యేలు

నల్లగొండ, అక్టోబర్ 4 : ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులుగా నియమితులైన కనగల్ మండల వాసి జిల్లా శంకర్, కొండమల్లేపల్లి వాసి రాంబాబునాయక్ బుధవారం హైదరాబాద్‌లోని ఎస్సీ కమిషన్ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావుతోపాటు జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, రమావత్ రవీంద్రకుమార్, గాదరి కిశోర్ కుమార్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల సమగ్ర వికాసం, అభివృద్ధి కోసం కమిషన్ పాటుపడాలని సూచించారు. కమిషన్ సభ్యు లు జిల్లా శంకర్, రాంబాబునాయక్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతి కోసం కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ట్రైకార్ చైర్మన్ రాంచందర్‌నాయక్, గొర్రెలు, మేకల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజుయాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లి కార్జున్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నల్లగొండ పట్టనాధ్యక్షుడు బోనగిరి దేవేందర్, కనగల్ ఎంపీపీ కరీంపాషా, ఐతగోని యాదయ్య పాల్గొన్నారు.

# సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి

- ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య


గులాబీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

కట్టంగూర్, అక్టోబర్ 4 : కాంగ్రెస్, బీజేపీ నాయకులు మాయ మాటలతో ప్రజలను మోసం చేసేందుకు యత్నిస్తున్నాయని, వారి మాటలు నమ్మే స్థితిలో ప్రజలు లేరని ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మండలంలోని పిట్టంపల్లి గ్రామానికి చెందిన 50 మంది వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు బుధవారం కట్టంగూర్‌లో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుంటే కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఓర్వలేక పోతున్నారన్నారు. అమలుకు సాధ్యం కాని హామీలతో మరోసారి ప్రజల నెత్తిన టోపీ పెట్టేందుకు కాంగ్రెస్ నాయకులు సిద్ధమయ్యారని విమర్శించారు. అన్ని వర్గాల ప్రజల కోసం పని చేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఆదరించి కారు గుర్తుకు ఓటేసి మూడోసారి సీఎం కేసీఆర్‌ను ఆశ్వీరదించాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో గుండమల్ల రాములు, గుండమల్ల శంకరయ్య, బొప్పని లింగస్వామి, సాయి, గోలి పాపయ్య, గుండమల్ల నర్సింహ, గోలి లక్ష్మయ్య, కట్ట సైదులు, గుండమల్ల శివకుమార్‌తో పాటు కార్యకర్తలు ఉన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు ఊట్కూరి ఏడుకొండలు, ఎంపీపీ జెల్లా ముత్తిలింగయ్య, జడ్పీటీసీ తరాల బలరాములు, పిట్టంపల్లి సర్పంచ్ పనస సైదులు, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు పాలడుగు హరికృష్ణ, కోఆప్షన్ సభ్యుడు జానిపాషా, ఉప సర్పంచ్ గుండమల్ల సుమలతారామస్వామి, గ్రామశాఖ అధ్యక్షుడు చీర రవికుమార్, గుండమల్ల పురుశోత్తం పాల్గొన్నారు.

